



దుబ్బాకలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు(ఫైల్)


# 'దుబ్బాక'లో 87.51 శాతం పోలింగ్

- 86.87 శాతం మహిళలు, 88.17 శాతం పురుషులు
- జిల్లాలో అత్యధికంగా పోలింగ్
- గతంతో పోల్చితే పెరిగిన ఓటింగ్

దుబ్బాక, డిసెంబర్ 1 : ఉద్యమాల గడ్డ దుబ్బాక నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరగింది. ఓటర్లు కెరటాల మాదిరిగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికలో ఓటింగ్ శాతం పెరిగింది. శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం దుబ్బాక నియోజకవర్గంలో 87.51 శాతం పోలింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారి గరిమా అగర్వాల్ తెలిపారు. గతంతో పోల్చితే ఈ ఎన్నికలో ఓటింగ్ పెరిగింది. సిద్దిపేట జిల్లాలో దుబ్బాక నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ జరగడం విశేషం. నియోజకవర్గంలో మొత్తం 1,98,100 మంది ఓటర్లున్నారు. ఇందులో 1,01,081 మంది మహిళలు, 97,019 మంది పురుషులున్నారు. వీరిలో 87,815 మంది మహిళలు (86.87 శాతం), 85,551 మంది పురుషులు (88.17శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల్లో యువతతోపాటు వృద్ధులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు.

**పోలింగ్ సరళి...**

దుబ్బాక శాసనసభ ఎన్నికల పోలింగ్ ఇలా కొనసాగింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 10.06శాతం, 9 నుంచి 11 వరకు 29.12 శాతం, 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు 48.27శాతం, 1 నుంచి 3 వరకు 70.48 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం 5 గంటల వరకు.. 82.75 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో మొత్తం 8751 శాతం పోలింగ్ జరిగింది.



**గతంతో పోల్చితే పెరిగిన ఓటింగ్ శాతం**

2018 సాధారణ ఎన్నికలో 85.92 శాతం..

2020 ఉప ఎన్నికలో 82.61 శాతం

2023 సాధారణ ఎన్నికలో 87.51 శాతం

2018 సాధారణ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో 190,483 మంది ఓటర్లుకు 1,63,658(85.92 శాతం) మంది ఓటర్లు ఓటు వేశారు. 96,780మంది మహిళా ఓటరులకు 83,176(85.94 శాతం), 93,703 మంది పురుషులకు 80,482 మంది(85.89 శాతం) ఓటు వేశారు.

**2020 ఉప ఎన్నికలో ....**

2020 ఉపఎన్నికలో 82.61 శాతం పోలింగ్ జరిగింది. దుబ్బాక నియోజకవర్గంలో 1,98,756 మంది ఓటర్లకు 1,64,186 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 1,00,778 మంది మహిళా ఓటర్లు ఉండగా వీరిలో 82,563మంది (81.92శాతం) ఓటు వేశారు, 97,978 మంది పురుష ఓటర్లు ఉండగా, వీరిలో 81,623 (83.30 శాతం) మంది ఓటర్లు ఓటు వేశారు.

**2023 ఎన్నికలలో 87.51శాతం పోలింగ్**

ప్రస్తుత ఎన్నికలో 1,98,100 మంది ఓటర్లకు 1,73,366 (87.51 శాతం) మంది ఓటు వేశారు. వీరిలో 1,01,081 మంది మహిళా ఓటర్లకు 87,815 మంది (86.87 శాతం) ఓటు వేశారు. 97,019 మంది పురుష ఓటర్లకు 85,551 మంది (88.17శాతం) ఓటు వేశారు. ఈ ఎన్నికలో మహిళల కంటే పురుషులే అధికంగా (1.30 శాతం) ఓటు వేశారు. దుబ్బాక నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి.

# చికిత్స కంటే నివారణే మందు

- హెచ్ఐవీ నివారణపై అవగాహన ఉండాలి
- ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్
- ఊరూరా 'ఎయిడ్స్' అవగాహన సదస్సులు




సిద్దిపేట : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్





వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రొఫెసర్ గోపాల్

సిద్దిపేట/ సిద్దిపేట టౌన్/ చేర్యాల, డిసెంబర్ 1 : హెచ్ఐవీ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ ఆదేశానుసారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని, అక్కడ అనుమానిత కేసులను ఐటీసీటీ సెంటర్లకు పంపించి వ్యాధి కన్ఫర్మేషన్ చేస్తామని, తర్వాత ఏఆర్టీ సెంటర్‌లో ట్రీట్మెంట్ ఇస్తారని వివరించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం తీసుకొని ప్రజల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాలలోని డీవీఎల్ హెచ్‌వోడీ మోహన్‌లాల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కమలాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి సత్యనారాయణ, జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ విభాగం సూపర్‌వైజర్ సంజీవ్, అధ్యాపకులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ఐటీసీటీ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎయిడ్స్ నియంత్రణకు కలిసి రావాలి**

ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కలిసి రావాలని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ గోపాల్ పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎయిడ్స్ నిర్మూలన విభాగ సమితి ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఇందుకు స్వచ్ఛంద సంస్థలు, యువత, అధికారులు ముందుకురావాలని కోరారు. ముందుగా ఎయిడ్స్ నిర్మూలనపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. సదస్సులో మెడి కల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీకాంత్, పల్లవి, విశ్వనాథం, కృష్ణయ్య పాల్గొన్నారు.




చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ దవాఖాన సిబ్బంది

**ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి**

**★ ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ స్రవంతి**

ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చేర్యాలప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ స్రవంతి అన్నారు. చేర్యాలలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. అవగాహన ఉంటే ఎయిడ్స్‌ను అరికట్టడం సులభమన్నారు. ప్రభుత్వ దవాఖానలో ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు లత, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ జితేందర్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

## కన్యకాపరమేశ్వరీకి
# లక్షగాజుల అలంకరణ



కన్యకపరమేశ్వరీ ఆలయంలో సామూహిక కుంకుమార్చన

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 1 : పట్టణంలోని రామాలయంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న వాసవి పారాయణలో భాగంగా శుక్రవారం అమ్మవారిని లక్షగాజులతో అలంకరించి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో 41రోజుల పాటు వాసవి పారాయణ చేస్తున్న మహిళలను మున్సిపల్ చైర్మన్ అభినందించారు.

# పాఠశాలలో అగ్ని ప్రమాదం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 1 : ప్రమాదవశాత్తు పాఠశాలలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన సిద్దిపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. సిద్దిపేట పట్టణంలోని కాకతీయ పాఠశాల పై అంతస్తులోని స్టోర్ రూమ్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా గదిలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఫ్రిడ్జ్, పుస్తకాలు, ఇతర సామగ్రి దగ్ధమైంది. స్కూల్ సిబ్బంది మంటలను గమనించి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

# గజ్వేల్‌లో తగ్గిన పోలింగ్

- గజ్వేల్‌లో 84.14శాతం పోలింగ్ నమోదు
- 2018 ఎన్నికల్లో 88.63 శాతం ఓటింగ్

గజ్వేల్, డిసెంబర్ 1 : గజ్వేల్ అసెంబ్లీ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్ 84.14శాతంగా నమోదైంది. అత్యధికంగా మనోహరాబాద్-1లో 99.18శాతం, అతి తక్కువగా గజ్వేల్ పోలింగ్ కేంద్రం 135లో 53.49శాతం నమోదైంది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత అధికారులు పోలింగ్ శాతాన్ని ప్రకటించారు. గజ్వేల్‌లోని తొమ్మిది మండలాలు, రెండు మున్సిపాలిటీల్లోని 321 పోలింగ్ కేంద్రాల్లో 2,74, 654 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,15,892 మంది, స్త్రీలు 1,15,191 మంది తమ ఓటుహక్కును వినియోగించుకొగా 84.14శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో 701మంది పురుషులు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2018 ఎన్నికల్లో 88.63శాతం నమోదు కాగా, ఈ ఎన్నికలో 84.14శాతం నమోదైంది. గతంలో కంటే 4.49శాతం తక్కువగా పోలింగ్ నమోదైంది.

**- 90శాతం పోలింగ్ నమోదైన బూత్‌లు**

పడాలపల్లిలో 91.28శాతం, దాతర్‌పల్లి 91.65, కొనాయిపల్లి (పీటీ) 92.22, వెంకటాయిపల్లిలో 92.11, కిష్టాపూర్‌లో 93.71, బ్రాహ్మణపల్లిలో 91.32, అల్లాపూర్‌లో 90.76, వెంకటాపూర్‌లో 92.22, అనంతగిరిపల్లిలో 91.91, గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లిలో 91.42, కోమటిబండలో 91.60, రంగంపేటలో 96.49, గిరిపల్లిలో 91.24, అనంతరావుపల్లిలో 91.90, సింగాటం-1లో 90.60, వర్గల్ మండలం శేర్‌పల్లి(మక్త) 91.60, కుకునూర్‌పల్లి మండలం మంగోల్‌లో 90.01, మాత్‌పల్లిలో 90.96, కొనాయిపల్లిలో 91.22, కొండపాక-4లో 90.18, దమ్మక్కపల్లిలో 90.85, లకుడారం-1లో 90.52, లకుడారం-2లో 93.05, బొబ్బాయిపల్లిలో 91.25, బూరుగుపల్లిలో 93.43, క్యాసారంలో 91.53, సంగుపల్లిలో 92.38, మైలారంమాక్తలో 92.39, జబ్బాపూర్‌లో 96.18, గిర్మాపూర్‌లో 90.60, గోవిందపూర్‌లో 94.71, అంబర్‌పేటలో 93.84, సీతారాంపల్లిలో 92.99, రామయపల్లిలో 93.95, పాలటలో 93.21, జీడిపల్లిలో 91.51, జీడిపల్లి-2లో 91.49, కొండపూర్‌లో 91.13, చెట్లగౌరారంలో 93.53, మీనాజిపేట-1లో 91.02, మీనాజిపేట-2లో 91.82, తునికిమక్తలో 95.05, తునికిఖల్సాలో 90.64, నాగారం తండాలో 92.00, చౌదర్‌పల్లిలో 90.39, శేర్‌పల్లిలో 91.72, సింగాయిపల్లిలో 91.01, రామచంద్రాపూర్‌లో 95.83, రాయవరంలో 92.01, వెంకటాపూర్(పీటీ)లో 93.67, అనంతసాగర్‌లో 91.08, దాతర్‌పల్లిలో 93.38, అక్కారంలో 91.38, పాములపర్తిలో 90.54, పాతూర్‌లో 92,17, తానేదార్‌పల్లిలో 94.10, శ్రీ రాంపూర్‌లో 92.21, అచ్చాయిపల్లిలో 92.61, దాసర్లపల్లిలో 90.78, గంగాధర్‌పల్లిలో 91.36, నాగిరెడ్డిపల్లిలో 94.20, నర్సంపల్లిలో 92.22, భావనందపూర్‌లో 92.85, చెబర్తిలో 91.95, చెబర్తి-2లో 90.20, నర్సన్నపేటలో 91.05, గొల్లపల్లిలో 90.33, శివారువెంకటాపూర్‌లో 94.72, కొట్యాలలో 92.98, కర్కపట్లలో 91.95, కాశిరెడ్డిపల్లిలో 90.19, వర్ధరాజ్‌పూర్‌లో 90.37, లింగారెడ్డిపల్లిలో 90.88శాతం.